## క్లుప్తంగా

### పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.ఎ.గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 28వ తేదీ వరకు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణకు వచ్చిన విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహిస్తామన్నారు. పాలిసెట్‌కు సంబంధించి ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### బాధ్యతల స్వీకరణ


జి.వి.ఎస్.ఎస్.మూర్తి

కొత్తూరు: సబ్‌ట్రెజరీ ఎస్టీఓగా జి.వి.ఎస్.ఎస్.మూర్తి బుధవారం విధుల్లో చేరారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న మూర్తి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎస్టీఓగా పనిచేసిన మధుసూదనరావు గత నెల 29 తేదీన మృతి చెందారు. టెక్కలి ఎస్టీఓ భాగ్యలక్ష్మికి కొత్తూరు ఎస్టీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బదిలీపై వచ్చిన మూర్తికి భాగ్యలక్ష్మి బాధ్యతలను అప్పగించారు.

### ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

హిరమండలం: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకున్నవారు ఉంటే క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని తహసీల్దార్ ఎస్.హనుమంతరావు బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించి జీఓ నంబర్ 30ను జారీ చేసిందన్నారు. కేవలం అభ్యంతరంలేని ప్రభుత్వ స్థలాల్లో కట్టిన ఇళ్లను మాత్రమే క్రమబద్ధీకరిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షల ఆదాయంలోపు ఉన్నవారు ఉండాలని, ఇదివరకే ప్రభుత్వం నుంచి ఇళ్ల లబ్ధి పొందకూడదన్నారు. ఆదాయపు పన్ను చెల్లించకూడదని, 300 యూనిట్ల కరెంట్ వాడకం దాటినా, నాలుగు చక్రాల వాహనం ఉన్నా అనర్హులన్నారు. ఈ అవకాశం ఉన్నవారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, సిబ్బంది

ఆమదాలవలస: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్‌కు సంబంధించిన అన్ని అంశాలూ ఈ డైరీలో పొందుపరిచారన్నారు. ఈ డైరీ ఉద్యోగులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఇందులో నేర్చుకోవాల్సిన అంశాలు, మున్సిపల్ చట్టాలు ఉన్నాయన్నారు. మున్సిపల్ ఉద్యోగులు పి.వి.ఎస్.రాజు, చక్రవర్తి, ఆర్‌ఐ టి.గోవిందరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

### కఠినంగా శిక్షించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

జలుమూరు: మండల పరిధిలోని యలమంచిలి, అక్కురాడ, కొండపోలవలసలోని హిందూ ఆలయాలపై అన్యమత సూక్తులు రాసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం జలుమూరు ఏవీకే ఫంక్షన్ హాల్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. దీనికి ముందు ర్యాలీ నిర్వహించారు. దోషులను వెంటనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ అశోక్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు లోకనాథం, ఆనందరావు, సూరన్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### పట్టాలు మంజూరు చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

పాతపట్నం: ఎన్నో ఏళ్లుగా సాగుచేస్తున్న కొండ పోరంబోకు భూములకు పట్టాలు మంజూరు చేయాలని మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎస్సీలు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ముద్దాడ దేవి, శాంతమ్మ, శ్రీనివాసులు, బొకర మహాలక్ష్మి, రాములమ్మ మాట్లాడుతూ కొండపై జీడి మామిడి తోటలను సాగు చేస్తున్నామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో అన్నెపు ఉమామహేశ్వరరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# అటకెక్కిన.. ఆహార సలహా కమిటీలు

- రేషన్ షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- నరుకుల పంపిణీలో మోసాలు
- పట్టించుకోని అధికారులు

| మండలం | రేషను షాపులు | కార్డులు |
|---|---|---|
| పాతపట్నం | 46 | 19,929 |
| మెళియాపుట్టి | 44 | 16,413 |
| కొత్తూరు | 60 | 22,122 |
| హిరమండలం | 31 | 11,965 |
| ఎల్.ఎన్.పేట | 36 | 10,775 |


పాతపట్నం తహసీల్దార్ కార్యాలయం

పాతపట్నం: రేషన్ షాపులలో అక్రమాలు జరగకుండా చూడటంతోపాటు నిరుపేదలకు సక్రమంగా రేషన్ అందేలా ఆహార సలహా సంఘాలు పర్యవేక్షించేవి. గతంలో ఎంతో బాధ్యతతో వ్యవహరించే సంఘాలు నేడు ఎక్కడా కానరావడం లేదు. సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తుకాలలో మోసాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతీ మూడు నెలలకోసారి మండల స్థాయిలో ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమై.. మండల పరిధిలో ఉన్న రేషన్ షాపుల నిర్వహణపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. పాతపట్నం నియోజకవర్గం పరిధిలో 217 రేషన్‌షాపులున్నాయి. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో 81,204 రేషన్ కార్డులున్నాయి. ఆహార సలహా కమిటీ సంఘాలకు చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్.. జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతీ మూడు నెలలకోసారి సభ్యులు సమావేశమై.. ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి తీసుకోవాల్సి చర్యలపై సమీక్షించేవారు. అయితే నేటి పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది.

**ఇష్టారాజ్యంగా..**

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునే నాథులే కరువయ్యారు. రేషన్ షాపులలో తూకాలలో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను కొన్నిచోట్ల నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

### పర్యవేక్షణ లేదు



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి, సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపులలో వచ్చే లోటుపాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కారం చేసేవారు. ప్రస్తుతం కమిటీల ఉనికి లేకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.

– మురళీ అప్పో, సీతారాంపల్లి, పాతపట్నం మండలం

### త్వరలోనే సంఘాలను నియమిస్తాం



చౌకధరల దుకాణాల పరిధిలో ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ప్రతీ చౌకధరల దుకాణం పరిధిలో త్వరలోనే సంఘాలను ఏర్పాటు చేస్తాం.

–ఎస్.కిరణ్‌కుమార్, తహసీల్దార్, పాతపట్నం

## రెల్లి కులస్తుల నిరసన


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న రెల్లి గ్రూప్ కులాల నాయకులు

నరసన్నపేట: ఎస్సీ వర్గీకరణలో రెల్లి సబ్ కులాలకు తీరని అన్యాయం జరిగిందని, ఈ వర్గీకరణను పునః సమీక్షించి అందరికీ న్యాయం చేయాలని కోరుతూ నరసన్నపేటలో రెల్లి గ్రూప్ కులాలకు చెందిన ప్రతినిధులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రిజర్వేషన్ల ప్రక్రియలో ఏబీసీడీలుగా విభజించి, రెల్లి గ్రూప్ కులాలను 'ఏ' లో చేర్చి ఒక శాతం కేటాయించారని, దీనివలన తమకు చాలా అన్యాయం జరుగుతుందని నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, కోటిపల్లి శ్రీను, నాగవంశం శ్రీనివాస్(డేవిడ్) బెవర రాము అన్నారు. మరోసారి పునః సమీక్ష చేసి రిజర్వేషన్లు పెంచాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అయినా రెల్లి గ్రూప్ కులాలకు విద్య, ఉద్యోగం, ఉపాధి ఆశించిన స్థాయిలో అందలేదన్నారు. హేతుబద్ధతలేని వర్గీకరణను ఆపాలని, కుల గణన చేసి జిల్లా, జోన్ల వారీగా వర్గీకరణ చేయాలని, వెనుకబాటుతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

హిరమండలం: ఈ నెల 4వ తేదీన హిరమండలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

### జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం


అభ్యర్థులను తనిఖీ చేసి లోపలకు పంపిస్తున్న సిబ్బంది

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో కట్టుదిట్టమైన భద్రత మధ్య జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. ఒక్కో షిఫ్టులో 220 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మరో మూడు రోజులు పరీక్షలు జరగనున్నాయి.

## ఏకగ్రీవంగా రామభక్త హనుమాన్ కమిటీ


నూతన కార్యవర్గ సభ్యులు

నరసన్నపేట: మండలంలోని మడపాం వద్ద అభయాంజనేయ స్వామి ఆలయానికి రామభక్త హనుమాన్ సేవా సంఘం పేరిట నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తంగుడు జోగారావు, గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బాడాన రాజశేఖర్, ముఖ్య సలహాదారుడిగా పి.కృష్ణ, ఉంగటి పాపారావు, ఉపాధ్యక్షులుగా జాయి శేషు, జాయి ఫల్గుణరావు, ప్రగడ రాజేశ్వరరావు, కింజరాపు సూర్యనారాయణ, పంచిరెడ్డి రమణమూర్తి, కవిటి రామరాజును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పొట్నూరు నీలం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చింతు మల్లేశ్వరరావు, మారెళ్ల అప్పలనాయుడు, ట్రెజరర్‌గా జాయి జత్యవతి, సహాయ కార్యదర్శులుగా మార్పు సురేష్, మార్పు శ్రీను, వడ్డి మురళి, గొండు సింహాచలంను ఎన్నుకున్నారు.

### ఘనంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ టాకీస్ పక్కన ఉన్న రామ మందిరంలో సీతారాముల కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మావుదూరు జగదీష్ బాబు ఆధ్వర్యంలో కల్యాణం ట్రస్టు ప్రతినిధులు ఊణ్ణ వైకుంఠరావు, ఊణ్ణ వెంకటేశ్వరరావు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జట్టు కలాసీ సంఘం భవనం వద్ద నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. కలాసీ సంఘం అధ్యక్షుడు జనార్దరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక


జోత్స్నను అభినందిస్తున్న తల్లిదండ్రులు, సోదరుడు

ఆమదాలవలస: పట్టణంలోని బీఆర్‌నగర్‌కు చెందిన నక్క జోత్స్న ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తండ్రి రమణమూర్తి (తెలుగు ఉపాధ్యాయుడు) బుధవారం తెలిపారు. విజయనగరం జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ (ఈఈఈ) పూర్తి చేసింది. ఇదివరకే ఎల్‌అండ్‌టీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించింది. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పీఓగా కొలువును సాధించింది. ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పీఓగా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంకులో క్లర్క్ పోస్టులకు ఎంపికైంది. జోత్స్న స్వగ్రామం బూర్జ మండలం ఓవీపేట. ప్రస్తుతం ఆమదాలవలస బీఆర్‌నగర్‌లో స్థిరపడ్డారు. జోత్స్న తల్లి మాజీ సర్పంచ్. సోదరుడు బ్యాంక్ ఉద్యోగి. కుమార్తెకు ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థుల సందడి


మెళియాపుట్టి: గిరిజన సంప్రదాయ వేషధారణల్లో విద్యార్థులు


జలుమూరు: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

జలుమూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని ఎంఈఓలు బి.మాధవరావు, ఆర్.ఎస్.ప్రసాదరావు అన్నారు. బుధవారం లింగాలవలస ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు డ్యాన్స్‌లతో సందడి చేశారు. సర్పంచ్ దుంగ రమణమ్మ, హెచ్ఎం ఉంగటి అప్పల సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నందవలో..**

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధిలోని నందవ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులు గిరిజన సంప్రదాయ వేషధారణలో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, హెచ్ఎం కె.అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు


ప్రమాదంపై ఆరా తీస్తున్న వాణమ్మ, చిరంజీవినాగ్

ఆమదాలవలస: పట్టణ శివారులోని తిమ్మాపురం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు వెళ్తున్న కారును పాలకొండ నుంచి నరసన్నపేట వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయింది. కారు పూర్తిగా పాడైంది. అటువైపుగా సొంత పనిపై వెళ్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి వాణమ్మ, కుమారుడు చిరంజీవినాగ్ ప్రమాద ఘటన దగ్గర ఆగారు. 108కు ఫోన్‌చేసి క్షతగాత్రుడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించేందుకు సహకరించారు. ఆటో డ్రైవర్ అపస్మారక స్థితిలో ఉండటంతో ఆయన వివరాలు తెలియలేదు. దీనిపై ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

### నిరుపయోగం..



ఆమదాలవలస పరిధిలోని బి.ఆర్.నగర్ ప్రాంతంలో ప్రయాణికుల సౌకర్యార్థం 1999లో రూ.20 లక్షల వ్యయంతో బస్టాండ్ నిర్మించారు. మొదట్లో శ్రీకాకుళం నుంచి హిరమండలం, పాలకొండ, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు బస్టాండ్ వద్దకు చేరుకొని నిలుపుదల చేసే పరిస్థితి ఉండేది. పట్టణంలో కొత్తగా మరో బస్టాండ్ నిర్మించడంతో.. ఈ బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

### అధ్వానం..



నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలోని పోస్టాఫీస్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. మెయిన్ రోడ్డు నుంచి జర్నలిస్టుల కాలనీ మీదుగా పోస్టాఫీసు, పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇది. మెయిన్ రోడ్డు నుంచి పోస్టాఫీస్ వరకు రోడ్డు పూర్తిగా పాడైంది. వాటర్ పైపుప్‌లు పాడైతే రోడ్డు మొత్తం తవ్వేసి వదిలేశారు. మెయిన్ రోడ్డు దాటిన వెంటనే మరీ దారుణంగా ఉంది. రోడ్డును బాగుచేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– నరసన్నపేట

### వంతెన దాటేవరకు దడే..



ఈ చిత్రం హిరమండలం మండలంలోని కిట్టలపాడు వద్ద వంశధార ఎడమ కాలువపై శిథిలావస్థకు చేరుకున్న వంతెన. ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. వంతెన కింద భాగంలో పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ వంతెన పైనుంచి కిట్టలపాడుతోపాటు వైదేహి, కూర్మ, పూనిపేట, అంతకాపల్లి గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. దీని స్థానంలో మరో వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– హిరమండలం

### అడవి జంతువులున్నాయి జాగ్రత్త..



సారవకోట మండలంలోని నౌతళ ఘాట్ రోడ్డు (జాతీయ రహదారి (326–ఎ)కు ఇరువైపులా అడవి జంతువులున్నాయి జాగ్రత్త అంటూ అటవీ శాఖాధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డుకు ఆనుకుని రిజర్వ్ పారెస్ట్ ఉంది. అడవి జంతువులు రాత్రి పూట రోడ్డుపైకి చేరి అడ్డంగా ఉంటున్నాయి. ఈ మార్గంలో ప్రమాణించే వాహనదారులు వీటిని గమనించుకుంటూ వెళ్లాలని కోరుతూ బోర్డులు ఏర్పాటు చేశారు.

– సారవకోట

## అశ్రద్ధ చేయొద్దు..


సారవకోట: ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న భవిత కేంద్రం సిబ్బంది


సరుబుజ్జిలి: ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, సరుబుజ్జిలి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు


మెళియాపుట్టి: ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు


హిరమండలం: భవిత కేంద్రంలో చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ గ్రేస్ శాంతి

చిన్నారుల్లో వయస్సుకు తగిన మానసిక ఎదుగుదల లేకపోతే అశ్రద్ధ చేయవద్దని వైద్యులు సూచించారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రాల్లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య, భవిత కేంద్రాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఫిజియోథెరపీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పుట్టిన మూడు నెలల నుంచే సాధారణ శిశువు తల్లిని గుర్తుపడుతుందన్నారు. ఆటిజం ఉన్నవారిలో చూపు, వినికిడి సమస్య, జ్ఞాపికశక్తి తక్కువగా ఉంటుందన్నారు. ఇటువంటి చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్

## నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలో గల 23 వార్డులకు చెందిన బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్ బుధవారం తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు నేరుగా, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 396 మంది అభ్యర్థులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ధ్రువపత్రాలను ఇంటర్వ్యూకు తీసుకురావాలని సూచించారు.